తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

ప్రభుత్వ విప్ ఉదయభాను


డాంగేనగర్‌లో ట్యాంక్ వద్ద ఇంటర్ కనెక్షన్ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: వేసవిలో పట్టణంలోని అన్ని వార్డుల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. వార్డుల్లో ప్రజలు తాగునీటికి ఫిర్యాదులు చేసినా, సరఫరాలో అంతరాయం ఏర్పడినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. పట్టణంలోని డాంగేనగర్ రిజర్వాయర్ వద్ద పైపులైన్ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక కారణాలతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. డాంగేనగర్‌లోని రిజర్వాయర్ (వాటర్ ట్యాంక్) వద్ద మోటార్లలో సాంకేతిక లోపం కారణంగా కొన్ని రోజులుగా ట్యాంక్ పైకి నీరు పూర్తి స్థాయిలో ఎక్కడం లేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ట్యాంక్ వద్ద పైపులైన్‌కు చేపట్టిన ఇంటర్ కనెక్షన్‌కు కొత్తగా వాల్వును కలిపే పనులను ప్రారంభించినట్లు తెలిపారు. దీంతో 30,31, 1,2,3 వార్డులకు పుష్కలంగా నీటి సరఫరా జరుగుతుందన్నారు.

జాప్యం చేయొద్దు....

పట్టణంలో అన్ని ప్రాంతాలకు నీరందేలా సరిపడా ట్యాంకులు ఉన్నా నీటి సరఫరాలో తరచూ తలెత్తే సాంకేతిక లోపాలను గుర్తించి నివారించడంలో ఇంజినీరింగ్ శాఖ విఫలమవుతోందని ఎమ్మెల్యే ఉదయభాను ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నీ ఉన్నప్పటికీ నిర్వహణా లోపం కొట్టొచ్చినట్లు కనపడుతుందని మండిపడ్డారు. సమస్య ఎదురైనప్పుడు అధికారులు తమ దృష్టికి తీసుకురావాలని, అప్పుడే పరిష్కారం లభిస్తుందన్నారు. మరొకసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే ఉపేక్షించబోమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మను తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, కొలగాని రాము, మోరె బాబీ, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు భవానీప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ పింగళి నర్సింహారెడ్డి, నాయకులు పూసాల పుల్లారావు, దువ్వల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘అప్సర’ రోడ్డుకు పొట్టి శ్రీరాములు వీధిగా నామకరణం

ప్రభుత్వ విప్ ఉదయభాను


పొట్టి శ్రీరాములు విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని అప్సరా థియేటర్ రోడ్డుకు త్వరలో అమరజీవి పొట్టి శ్రీరాములు వీధిగా నామకరణం చేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని తెలిపారు. స్థానిక అప్సరా థియేటర్ రోడ్డులో ఎగుమతి, దిగుమతి వర్తక సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం పున ః ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర అవతరణతో పాటు తెలుగు జాతి ఔన్నత్యానికి అహర్నిశలు పొట్టి శ్రీరాములు చేసిన కృషి, ప్రాణత్యాగం మరువలేనిదన్నారు. నేటి యువత ఆయన త్యాగనిరతిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. 1954 లోనే బెజవాడ గోపాలరెడ్డి వంటి పెద్దల సమక్షంలో ప్రతిష్ఠించిన ఈ విగ్రహం శిథిలావస్థకు చేరడంతో పునః ప్రతిష్ఠించుకున్నామని తెలిపారు. త్వరలో ఈ వీధికి పొట్టి శ్రీరాములు వీధిగా నామకరణం చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ నూకల సాంబ, ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి నాగబ్రహ్మం, పార్టీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్,వాణిజ్య విభాగం, ఎస్టీ సెల్, కార్మిక విభాగాల అధ్యక్షులు చారుగుండ్ల కొండ, బద్దూనాయక్, గోగుల వెంకయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మెపల్లి నరేంద్రరావు, నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ పరీక్ష వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన టెన్త్ విద్యార్థులకు ఏటా ప్రజ్ఞా వికాసం పేరుతో నిర్వహించే మోడల్ పరీక్ష వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్, బాలికల హైస్కూల్స్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 20న మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.కృష్ణయ్య, జిల్లా నాయకులు హనుమంతరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.గోపినాయక్, మండల కార్యదర్శి ఎస్.ప్రణయతేజ, అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాలలో స్కిల్ హబ్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు అకౌంటెంట్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ డేటా ఎంట్రీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి, అనంతరం స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలను కల్పిస్తామని పేర్కొన్నారు. 30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఆపైన విద్యార్హతలు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8919951682లో సంప్రదించాలని కోరారు.

సమాజానికి రోటరీ విస్తృత సేవలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ సమాజానికి విస్తృతమైన సేవలందిస్తుందని ఆ సంస్థ అధ్యక్షుడు బాయన బాబుజీ(బాబ్జీ) అన్నారు. కుష్టు వ్యాధి వారోత్సవాలను పురస్కరించుకుని క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి, నగరంలోని ఇతర ప్రాంతాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులకు చెప్పుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యా, వైద్య, సామాజిక సేవారంగాలకు రోటరీ పలు రకాల సేవలందిస్తుందన్నారు. క్లబ్ స్వర్ణోత్సవాలను జరుపుకుంటున్న తరుణంలో కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుంకర నాగభూషణం, సభ్యులు ముదిలి మోహనరావు, తిరుమల విశ్వేశ్వరరావు, ఎండీ అమానుల్లా, కే మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆకుకూరలు తప్పకుండా తీసుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు చిరుధాన్యాలు, ఆకుకూరలను తీసుకోవడం ద్వారా రక్తహీనత రాకుండా చూసుకోవచ్చని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాస విఠల్ రావు సహకారంతో ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించడంతో పాటు రక్తహీనత ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులు జంక్‌ఫుడ్‌ను తగ్గించి మంచి పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.రమేష్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


కిట్లను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మందులు క్రమం తప్పకుండా వాడటంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం 200 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. రోగులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ద్వారా పోషకాహార కిట్లను పంపిణీ చేయడం అభినందనీయమని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా రెండు వేల మందికి పైగా క్షయ వ్యాధితో బాధపడుతున్నారని వెల్లడించారు. వారందరికీ పౌష్టికాహార కిట్లను అందించి, రోగ నిరోధక శక్తిని పెంచే విధంగా ఆరు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. క్షయ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తగ్గకుండా పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా క్షయ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులను అశ్రద్ధ చేయకుండా వాడుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలకు తోడు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ప్రాణాంతకమైన అంటువ్యాధి అయిన క్షయ ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందన్నారు.

పౌష్టికాహారన్ని తీసుకుని వ్యాధిగ్రస్తులు త్వరితగతిన కోలుకుని ఆరోగ్యవంతులు కావాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమకూర్చిన 16 డిజిటల్ హిమోగ్లోబిన్ ఎనలైజర్లను వార్డు హెల్త్ సెక్రటరీలకు కలెక్టర్ ఢిల్లీరావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం అందజేశారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రెహమాన్, కార్యదర్శి డాక్టర్ మనోజ్, జిల్లా టీబీ కంట్రోలింగ్ అధికారి డాక్టర్ ఉషారాణి పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాల్లోనూ రాణించాలని సెయింట్ థామస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ రాజు డేవిడ్ పేర్కొన్నారు. విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలోత్సవంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం స్కూల్‌లో అభినందనలు తెలిపారు. సెయింట్ థామస్ స్కూల్ విద్యార్థులు 13 అంశాల్లో రాణించారన్నారు. ఫ్యాన్సీ డ్రస్ పోటీల్లో ఎస్.జోషిత ప్రథమ స్థానం, నీతి పద్యం విభాగంలో షేక్ ఆజాద్ తృతీయ స్థానం, హ్యాండ్ రైటింగ్‌లో సీహెచ్ హర్షవర్ధన్ ద్వితీయ స్థానం, పరుగు పందెంలో సబ్ జూనియర్ కేటగిరిలో షేక్ సుభానీ, గోనె సంచుల విభాగంలో వరుణ్‌కుమార్, సూదిదారం విభాగంలో పీ కుసుమ నాగసాయి ద్వితీయ స్థానం, జానపద గేయం విభాగంలో ఎల్. శరణ్య, పీ కుసుమ నాగసాయి శ్రీలు తృతీయ స్థానం, ఆర్.చరత్‌చంద్, చంద్రశేఖర్, పరుగు పందెంలో పీ రాజేష్, గోనెసంచుల విభాగంలో జీ దుర్గాగణేష్ తృతీయ స్థానం సాధించారన్నారు. మరిన్ని క్రీడా పోటీల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు.

వృత్తి నైపుణ్యాలకు పదును పెట్టాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ డి.సూర్యనారాయణ స్ఫూర్తితో వృత్తి నైపుణ్యాలకు మరింత పదును పెట్టాలని టీసీఎస్ మాజీ వైస్ ప్రెసిడెంట్ డి.విజయకుమార్ అన్నారు. సూర్యనారాయణ సంస్మరణ సభ, శిష్య ప్రశిష్య కలయిక కార్యక్రమాన్ని కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్లో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయకుమార్ మాట్లాడుతూ సూర్యనారాయణ శిష్య ప్రశిష్యులు ఎంతో మంది ఈ రంగంలో రాణించారని చెప్పారు. సుమారు రెండు వేల మంది చార్టర్డ్ అకౌంటెంట్లుగా ప్రపంచ వ్యాప్తంగా విస్తృతమైన సేవలు అందిస్తున్నారని చెప్పారు. సుమారు మూడు దశాబ్దాల తరువాత అందరూ కలిసి తమ గురువు సూర్యనారాయణను స్మరించుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్లు ఎం.కృష్ణమూర్తి, కొంకిమళ్ల శ్యామ్, చక్రవర్తి, రామకృష్ణ, కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు పాల్గొన్నారు. తొలుత సూర్యనారయణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పారిశుద్ధ్య మెరుగుదల పనులు ప్రారంభం



కంచికచర్ల: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ బుడ్డి విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని చెవిటికల్లు గ్రామంలో సోమవారం మురుగుకాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి నీరు పారుదల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మేరకు సర్పంచ్ మాట్లాడుతూ ఇళ్లల్లో వాడుకునే మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని లేకపోతే దోమలు వ్యాప్తి చెంది అవి కుట్టటంతో అంటు రోగాల బారిన పడతారన్నారు. గ్రామంలో ప్రతిరోజు తాగునీటి సరఫరా అయ్యేలా చూస్తున్నామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఎబేట్‌ను పిచకారీ చేయిస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి కనగాల రవికుమార్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పందనకు ఏడు అర్జీలు

వీరులపాడు: స్పందనకు వచ్చే ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆశయ్య తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య కిట్‌లు పంపిణీ

జుజ్జూరు(వీరులపాడు): గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచ్ రమావత్ కోటి తెలిపారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులకు సోమవారం ఆమె జగనన్న ఆరోగ్య కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ

కంచికచర్ల: మిక్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగంలో గత వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న అధ్యాపకుల శిక్షణ శిబిరం ముగిసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఎన్ఐటీ వరంగల్ ఐటీసీ విభాగం సౌజన్యంతో నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ బయో మెడికల్ ఫీల్డ్ అనే అంశంపై 8రోజుల పాటు శిక్షణ నిర్వహించారని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పని విధానం, వాటి ఉపయోగాలు పలు అంశాలపై అవగాహన కల్పించారన్నారు. అనంతరం అధ్యాపకులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పుల్లారావు, కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ మెంబర్ ఎం.సుహాస్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ వంశీకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎమ్మార్పీఎస్ కార్యకర్తల అరెస్ట్

గరికపాడు(జగ్గయ్యపేట): పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన జాతీయ రహదారుల దిగ్బంధ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. మండలంలోని గరికపాడు రాష్ట్ర సరిహద్దు వద్ద ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.

మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని భవానీ ముక్తేశ్వరస్వామి మహా శివరాత్రి ఉత్సవాలు ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుండంతో ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఈవో నాగరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 నుంచి 23 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 18న మహా శివరాత్రి సందర్భంగా స్వామి వారి కళ్యాణం ఉండటంతో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. జల్లు స్నానాల తోపాటు, చలువ పందిళ్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ, పంచాయతీ, పోలీస్, నీటిపారుదల శాఖాధికారులతో కూడా మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ లో విద్యా రంగంపై నిర్లక్ష్యం

నందిగామ: కేంద్ర బడ్జెట్ లో విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేశారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి కూడా ప్రభుత్వ విద్యా రంగం గురించి ప్రస్తావించలేదన్నారు. విద్యా రంగం పట్ల బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తుందని ధ్వజమెత్తారు. డివిజన్ కార్యదర్శి గోపి నాయక్, పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల ప్రదర్శన



నందిగామ: మండలంలోని చెరుకుంపాలెం గ్రామంలో పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటను సోమవారం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ప్రదర్శించడంతోపాటు విక్రయాలు చేపట్టారు. గ్రామంలోని పలువురు రైతులు పండించిన పలు రకాల కూరగాయలు, ఆకుకూరలను ప్రదర్శించారు. పలువురు గ్రామస్తులు వాటిని కొనుగోలు చేశారు. రైతు భరోసా కేంద్ర సిబ్బంది సత్యనారాయణ, వినోద్ పాల్గొన్నారు.

ఎయిమ్స్‌కు బస్సు నడపాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ నుంచి సాంబమూర్తి రోడ్డు మీదుగా మంగళగిరి ఎయిమ్స్‌కు సిటీ బస్సు నడిపాలని సోమవారం స్పందనలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బీ వసంతకుమార్ స్థానికులతో కలిసి విజ్ఞప్తి చేశారు. గతంలో తాము స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిమ్స్‌కు సిటీ బస్సు ఏర్పాటు చేశారని, తరువాత రోడ్డు బాగాలేదని నిలిపివేశారని పేర్కొన్నారు. ఇప్పుడు రోడ్డు బాగానే ఉండటంతో సర్వీసు పునరుద్ధరించాలని కోరారు.

ఆటల పోటీలతో యువతలో ఆత్మ విశ్వాసం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: క్రీడా పోటీలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. కోవిడ్ సమయంలో పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రామిశెట్టి సాయి మృతిచెందాడు. ఈ సందర్భంగా అతని మిత్రులు రామ లక్ష్మణ్ ఆధ్వర్యంలో రామిశెట్టి సాయి సంగమేష్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక ఆర్టీసీ డిపో గ్రౌండ్‌లో ఏర్పాటుచేశారు. దీన్ని ఎమ్మెల్యే ఉదయభాను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కోవిడ్‌తో మృతి చెందిన స్నేహితుని పేరు మీద ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహిస్తూ స్నేహానికి వారు చక్కని నిర్వచనాన్ని చాటాడం అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్లు కొలగాని రాము, వట్టెం మనోహర్, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పార్టీ మైనార్టీ, ఎస్టీ, వాణిజ్య, కార్మిక విభాగాల అధ్యక్షులు మొహిద్దీన్, బద్దూనాయక్, చారుగుండ్ల కొండ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు నాణ్యమైన సేవలందించాలి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


సప్తగిరి గ్రామీణ బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సప్తగిరి గ్రామీణ బ్యాంక్ శాఖను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారికి కావాల్సిన సేవలందించాలని కోరారు. ముఖ్యంగా బ్యాంకు సిబ్బంది ఖాతాదారులతో గౌరవంగా నడుచుకోవాలని సూచించారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు కోనాయపాలెంలో ఏర్పాటు చేయటం అభినందనీయమని తెలిపారు. ఖాతాదారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

భీమవరం రోడ్డు అభివృద్ధి


ప్రారంభానికి సిద్ధంగా భీమవరం రోడ్డు

భీమవరం(వత్సవాయి): భీమవరం రోడ్డును అభివృద్ధి చేశారు. చిల్లకల్లు వైరా రహదారిపై ఎన్ఎస్‌పీ కాలువ సమీపం నుంచి భీమవరం వెళ్లేందుకు రహదారి ఉంది. ఇదే మార్గంలో మక్కపేట, భీమవరం గ్రామాల రైతుల పొలాల కూడా ఉన్నాయి. గతంలో రోడ్డు అభివృద్ధికి నోచుకోపోవడంతో గోతులమయంగా ఉన్న రోడ్డుపైనే రాకపోకలు సాగించేవారు. రైతులు పంటలను ఇంటికి తీసుకురావడానికి కూడా నానాఇబ్బందులు పడేవారు. రైతులు, ప్రయాణికులు ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని గ్రామ నాయకులు గుండం రంగారెడ్డి రోడ్డు అభివృద్ధి ఆవశ్యకతను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడుతూ రూ కోటి నిధులను విడుదల చేయించారు. వెంటనే చిల్లకల్లు ప్రధాన రహదారి నుంచి భీమవరం వరకు రోడ్డును అభివృద్ధి చేశారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదింపచేయాలి


కీసర నేషనల్ హైవేపై ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

కంచికచర్ల : మండలంలోని కీసర, పేరకలపాడు క్రాస్ రోడ్డు వద్ద ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని నాయకులు, కార్యకర్తలు సోమవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో హైవేపై వాహనాలు అరగంటపాటు నిలిచిపోయాయి. ముందస్తు చర్యల్లో భాగంగా కంచికచర్ల పోలీసులు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఎమ్మార్పీఎస్ చేస్తున్న ఉద్యమానికి మద్దుతు తెలిపి కేంద్రంలో అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని మాదిగజాతిని నమ్మిస్తూ బీజేపీ నమ్మక ద్రోహం చేస్తుందని ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు యండ్రాతి కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బీజేపీ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదింపచేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథ్, మహిళా నాయకురాలు జ్యోతి, నాయకులు గుండాల ఈశ్వరయ్య, శివనారాయణ, ఓబులేసు, బాలయ్య, మారన్న తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు పోలీసుల కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌హెచ్‌ఓ సతీష్

నందిగామ: ఆటోలను నిబంధనల ప్రకారమే నడపాలని ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను ఎక్కించుకొని వస్తున్న ఆటోలను నిలుపుదల చేసి డ్రైవర్లతోపాటు అందులో ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారమే ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. అందుకు విరుద్ధంగా ఆటోలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక్కో ఆటోలో 30 మంది వరకు ఎక్కించుకోవడం నేరమన్నారు. ప్రమాదాలు జరిగితే నష్టం తీవ్రంగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గమనించి ఆటోలు నడపాలన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఒంగోలు ఫేస్ ఎస్ఆర్ ఒలింపియాడ్ స్కూల్లో ఈ నెల 12న ఇంటర్ డిస్ట్రిక్ట్ షోటోకాన్ కరాటే పోటీల్లో విజయవాడకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని బహుమతులను సాధించారు. కుమితే (ఫైట్) విభాగంలో అండర్–14 బాలురు ఎన్.అనిల్‌కుమార్ (గోల్డ్), ఎ.ఈశ్వర్ ఆదిత్య(సిల్వర్), టీ గణేష్ (సిల్వర్), వీ తులసీకుమార్ (బ్రాంజ్), అన్వర్ బాషా(బ్రాంజ్) మెడల్స్ సాధించారు. అలాగే కటా (ఫామ్స్) అండర్–14 గరల్స్ కోటాలో పీ శివ పార్వతి (గోల్డ్), బాలుర కటాలో టీ నవదీప్(సిల్వర్), టీ విజయ్ (బ్రాంజ్) మెడల్స్ దక్కించుకున్నారు. భాష్యం స్కూల్ విద్యార్థినులు బాలికల అండర్–12 విభాగంలో ఎస్ రిష్మిత లక్ష్మి(బ్రాంజ్), అండర్–12 బాలుర విభాగంలో ఎస్ రోహిత్(గోల్డ్), ఎస్ జోషి హర్ష(సిల్వర్), ఎస్‌కె నజీర్ హుస్సేన్(సిల్వర్), ఎండీ సుహాయిల్(సిల్వర్), పీ అద్వైత్(సిల్వర్), జి.సాకేత్ (బ్రాంజ్), ఎం.రిషికేశవ్ చౌదరి(బ్రాంజ్), పీ సాయి నిఖిలేష్‌రెడ్డి (బ్రాంజ్), వి జయంత్ (బ్రాంజ్) మెడల్స్ సాధించారు. కాగా కటా విభాగంలో ఎంఎస్ఆర్ స్కూల్ విద్యార్థి కొడాలి గౌతమ్ (బ్రాంజ్), 18 ఏళ్ల వయసుకుపైన ఫిమేల్ కటాలో ఎస్ఎల్ దివ్య గాయత్రి (గోల్డ్) మెడల్స్ సాధించారు. టోర్నమెంట్ చీఫ్ జడ్జిగా రాపోలు సుదర్శన్ వ్యవహరించారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవి బాబు, కొడాలి సాగరిక తదితరులున్నారు.